ఖాజాగూడ జంక్షన్ మూసివేత

గచ్చిబౌలి: ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌ను మూసివేస్తున్నట్లు రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. షేక్‌పేట్ ఫ్లైఓవర్, నానక్‌రాంగూడ రోటరీ, బయోడైవర్సిటీ జంక్షన్‌ల నుంచి వచ్చే వాహనాల రద్దీతో ఖాజాగూడ జంక్షన్ జాం అవుతోంది, ఈ క్రమంలో శనివారం నుంచి ఖాజాగూడ జంక్షన్ మూసివేయనున్నారు. నానక్‌రాంగూడ రోటరీ నుంచి విస్పర్‌వ్యాలీ వైపు వెళ్లే వాహనదారులు పక్వాన్ హోటల్ ముందు యూటర్న్ తీసుకోవాలి. షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి వాహనదారులు ఫిలింనగర్ వైపు వెళ్లాలంటే పక్వాన్ హోటల్ వద్ద యూటర్న్ తీసుకోవాలని, బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి మణికొండ వెళ్లాలనుకునే వారు షేక్‌పేట్ ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

మిల్లెట్ క్రిస్మస్ ట్రీ



గచ్చిబౌలి: మిల్లెట్స్‌తో క్రిస్మస్ ట్రీని రూపొందించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని పురస్కరించుకొని మిల్లెట్స్‌తో తయారు చేసిన క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. ఏడు రకాలైన ఫాక్స్‌టైల్ మిల్లెట్, బార్నార్డ్ మిల్లెట్ , పెర్ల్ మిల్లెట్, జొన్న మిల్లెట్, లిటిల్ మిల్లెట్, కోడో మిల్లెట్, ఫింగర్ మిల్లెట్లను క్రిస్మస్ ట్రీ తయారీలో ఉపయోగించారు. పది అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, పది కిలోల బరువుతో తయారుచేశారు. చిరు ధాన్యాలపై అవగాహన, ప్రోత్సహించేందుకు క్రిస్మస్ ట్రీ ని రూపొందించినట్లు మంజీరా హోటల్స్ అండ్ రిసార్ట్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.వి.గణేష్ తెలిపారు.





'క్లీన్' క్యాంపస్



హెచ్‌సీయూలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో చేపట్టిన క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న వాలంటీర్లు

- హెచ్‌సీయూలో స్వచ్ఛతకు పెద్దపీట
- ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో వీక్లీ క్లీనప్ డ్రైవ్
- హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారం
- తాజాగా ఆయుర్వేద, పూలు, పండ్ల గార్డెన్‌కు శ్రీకారం

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, పరిశోధనలకు పెద్ద పీట వేసే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను మరింత క్లీన్ క్యాంపస్‌గా మార్చే దిశగా నేషనల్ సర్వీస్ స్కీమ్ సెల్ అడుగులు వేస్తోంది. ఎన్‌ఎస్‌ఎస్ హెచ్‌సీయూ సెల్ క్యాంపస్‌లోని హార్టికల్చర్ విభాగం, శానిటేషన్ విభాగం సహకారంతో వీక్లీ క్యాంపస్ క్లీనప్ డ్రైవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో ప్రతి శనివారం క్యాంపస్‌ను శుభ్రం చేస్తున్నారు. హెచ్‌సీయూ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ సెల్ వాలంటీర్లుగా చేరిన వారితో సామాజిక, జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు చేస్తూనే క్లీన్ క్యాంపస్‌గా మార్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టి అమలు చేస్తున్నారు.

ఏప్రిల్ నుంచి క్లీనప్ డ్రైవ్

- హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో ఏప్రిల్–2023 నుంచి క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు.
- హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం సిబ్బంది మొత్తం 50 మందితో కలిసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- యూనివర్సిటీలో ఎంపిక చేసిన స్థలంలో వ్యర్థాలు, చెత్తాచెదారంను తొలగించి శుభ్రం చేస్తున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి శనివారం ఎన్‌ఎస్‌ఎస్ సెల్ పర్యవేక్షణలో శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు.

హెర్బల్, ఫ్రూట్, ఫ్లవర్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు

- హెచ్‌సీయూ క్యాంపస్ అంతటా పచ్చదనం కనువిందు చేస్తుంది.
- క్యాంపస్‌లో ప్రత్యేకంగా హెర్బల్, ఫ్రూట్, ఫ్లవర్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు.
- అందులో భాగంగా వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి స్థలాన్ని చదును చేశారు.
- వర్షాకాలం మొక్కలు నాటాలని నిర్ణయించారు. హెచ్‌సీయూను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌ఎస్‌ఎస్ సెల్, హార్టికల్చర్ విభాగాల అధికారులు పేర్కొంటున్నారు.

హెచ్‌సీయూ పేరు మరింత ఇనుమడించేలా..



హెచ్‌సీయూను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి శనివారం క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తున్నాం. విద్యార్థులను జాతీయసేవలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. వచ్చే రెండేళ్లలో జాతీయ స్థాయిలో హెచ్‌సీయూ పేరును మరింత ఇనుమడింపచేసేలా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అందరి సహకారంతో సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ముందుండేలా చేస్తాం.

–డా.కృష్ణయ్య, కోఆర్డినేటర్, హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ సెల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: తారానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫీడర్ పరిధిలోని వెంకటాద్రినగర్, లింగంపల్లి, పోచమ్మ టెంపుల్ ఏరియా, పీజేఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ప్రాంతాలు, శివాజీనగర్, తారానగర్ విలేజ్ వెనుక ప్రాంతంలో, తారానగర్ మజీద్ ఏరియా, విద్యానికేతన్ స్కూల్ ప్రాంతం, వెంకట్‌రెడ్డి కాలనీ, తెల్కార్ అపార్టుమెంట్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో....

ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, ఓల్డ్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, గంగారం విలేజ్‌లలో విద్యుత్ సరఫరా నినిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమనరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో..

హఫీజ్‌పేట్ : వేమనరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మార్పు చేస్తున్న ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంట వరకు కెఎస్ఆర్ ఫీడర్ పరిధిలో.. కెఎస్ఆర్ రోడ్, రోడ్ నెంబర్ 2,4,6,8,9,20,21 ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు పీజేఆర్ ఫీడర్‌లో.. పీజేఆర్ ఏరియా, రోడ్డు నెంబర్ 1,3,5,7,10,12 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మధ్యాహ్నం 03.20 గంటల నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు ఓల్డ్ బాంబే రోడ్డు (శంకర్‌నగర్) ఫీడర్ పరిధిలో ఓల్డ్ బాంబే రోడ్డు, శంకర్‌నగర్, జవహర్‌నగర్ కాలనీ, బీహెచ్ఈఎల్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొండాపూర్-శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు సౌకర్యం

- కొత్త రూట్లో రూట్ నంబర్ 333 బస్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో నుంచి నంబర్ 333 బస్సును కొండాపూర్ నుంచి శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు కొత్త బస్సుసౌకర్యాన్ని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ ప్రారంభించారు. శనివారం నుంచి ప్రతి రోజు ఈ బస్సు ఉదయం 6.30 గంటలకు కొండాపూర్ నుంచి మొదటి బస్సు బయలుదేరుతుంది. చివరి బస్సు సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరుతుంది. ఉదయం 6.30 గంటల నుంచి ప్రతి గంటకు ఒక బస్సును కొండాపూర్ నుంచి అందుబాటులో ఉండేలా చేస్తున్నారు.కొండాపూర్ నుంచి బయలుదేరి హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీ చెక్‌పోస్ట్, జర్నలిస్ట్ కాలనీ, ఏసీబీ ఆఫీస్, మాసబ్‌ట్యాంక్, సరోజిని ఆస్పత్రి, మెహదీపట్నం, అత్తాపూర్, హైదర్‌గూడ ఎక్స్‌రోడ్, ఉప్పరపల్లి ఎక్స్‌రోడ్, వీకర్ సెక్షన్ కాలనీ, ఆరాంఘర్, ఏజీకాలేజ్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు బస్సును నడిపిస్తారు. శంషాబాద్, ఎయిర్‌పోర్టు వైపు వెళ్ళే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి కోరారు.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఆవుల రవీందర్



రాయదుర్గం: యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆవుల రవీందర్ నియామకమయ్యారు.జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పి రవికాంత్‌గౌడ్ గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ఆవుల రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి చేరేలా చూస్తామన్నారు.



శిల్పారామంలో హస్తకళా ప్రదర్శన ప్రారంభం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్‌మేళా- 2023 శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేళాలో వివిధ రాష్ట్రాల చేనేత హస్తకళా ఉత్పత్తులు కొలువుదీరాయి. బనారసీ, చికన్‌కర్, టస్సర్, మంగళగిరి, గద్వాల్, మహేశ్వరం, పెయింటింగ్ చీరలు, చెక్క బొమ్మలు, విగ్రహాలు , గుజరాతీ శాలువాలు, ఇత్తడి విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. మేళా సందర్భంగా శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సంధ్యారాజు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో పూజ నృత్యం, తరంగం, శివాష్టకం, రుక్మిణీ ప్రవేశం, మరకత మణిమయ, అన్నమాచార్య కీర్తనలను సత్య, శరణ్య, శ్రియ, శ్రావ్య, లక్ష్మీ, పార్థ్వ, పింకి, ప్రద్యోత తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతలతో సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు తదితర విషయాలపై గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవాని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో శుక్రవారం ఓ సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ బూత్‌ల వివరాలు తదితరాలపై ఆయా పార్టీల ప్రజాప్రతినిధులతో చర్చించారు. 13వ బూత్‌ను మార్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులకు సూచించారు. బూత్‌ల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

మియాపూర్ : మియాపూర్‌లో మాజీ కౌన్సిలర్ రాంచందర్ ముదిరాజు ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు ముఖ్యా సత్యనారాయణ, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మోహన్, గంగాధర్,కిరణ్ యాదవ్, వెంకట్‌రావు, ప్రవీణ్, మాధవరం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మలింగేశ్వరస్వామికి గంగా జలాభిషేకం

మియాపూర్ : మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో శాంభవి శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ అష్ట భైరవ సహిత జ్యోతిర్మయి ఆత్మలింగేశ్వరస్వామికి గంగా జలాభిషేకం, బిల్వ పత్రార్చన, శివ సహస్రనామ సహిత హోమం, విజయ దుర్గాదేవికి నూతన 108 బుట్టల బూరెలు సమర్పించారు. సాయంత్రం రాజేశ్వరి సాయినాథ, వైష్ణవి బృందం చేసిన అపూర్వ లలిత సహస్రనామ నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీవాసులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అధికారులు సైతం ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఊరికి బయలుదేరిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం... కర్ణాటక కలబుర్గికి చెందిన మొగిలి మహేష్(32) బతుకుతెరువు కోసం ముత్తంగి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో డిసెంబర్ మూడో తేదీన సొంతూరికి బయలుదేరానని తన సోదరుడు మొగిలి సురేష్‌కు ఫోన్ చేశాడు.అయితే మహేష్ తన స్వగ్రామానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మహేష్ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా, స్వగ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో సోదరుడి అదృశ్యంపై అన్న మొగిలి సురేష్ శుక్రవారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ మి సి67డి విడుదల



మాదాపూర్: రియల్ మి కొత్తమోడల్ సి67డి ని ప్రముఖ సినీనటి శివానీ రాజశేఖర్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ రేతినేనితో కలిసి శుక్రవారం మాదాపూర్ సెలెక్ట్ మొబైల్స్ స్టోర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీస్‌ను, సరికొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టడంలో సెలెక్ట్ మొబైల్స్ ముందుంటుందన్నారు. ఈ మోడల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఉన్న అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఐటీటీ డైరెక్టర్ తరిణి ప్రసాద్, ఎల్ఎఫ్ఆర్ హెడ్ పునీత్ చతుర్వేది తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్-2023



బ్రోచర్‌ను విడుదల చేసిన హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తదితరులు

మాదాపూర్: విద్య, జీవనశైలి, పోషకాహారం, అభిరుచులు నాలుగు కీలక విభాగాలలో ఉత్పత్తులు, సేవలతో ప్రదర్శన ఉంటుందని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ సెంటర్‌లో హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ 2023కి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హైటెక్స్‌లో ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో పిల్లల పరుగు, భారీసైజు జెంగా, పిల్లల ఫ్యాషన్ షో, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లు, ఫ్లూయిడ్ ఆర్ట్ కార్యక్రమాలను ఉంటాయన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెండ్ స్మితా చౌదరి, హోలీ జాలీ డైరెక్టర్ అఖిల భూపతిరాజు, లైఫ్ స్పామ్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, హైదరాబాద్ రన్నర్స్ జనరల్ సెక్రటీ అరుణ్‌కుమార్, నటి ప్రజ్ఞ్యాన యన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దేవుడి కృప వలన ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌యస్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, పాస్టర్లు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి





గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయలో వార్షిక క్రీడోత్సవాలు, వ్యవస్థాపక దినోత్సవ వేడుకల దృశ్యాలు

- నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి
- ఘనంగా కేవీలో వార్షిక క్రీడోత్సవాలు

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయం గచ్చిబౌలి వార్షిక క్రీడోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు.

60వ వ్యవస్థాపక దినోత్సవం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలిలో 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహించారు.

అత్యధిక పేటెంట్లలో జపాన్‌ది అగ్రస్థానం

- భారత్ తన పరిశోధనలను మరింత పెంచాలి
- 'మనూ' లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్



మాట్లాడుతున్న లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్

రాయదుర్గం: సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం యొక్క పురోగతిని పేటెంట్ల పరంగా కొలుస్తారని మనూ లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'మేధో సంపత్తి- హక్కులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక పేటెంట్లతో జపాన్ అగ్రస్థానంలో ఉందని, చైనా ముందుకు దూసుకుపోతోందన్నారు. భారతదేశం తన పరిశోధనలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. యూనివర్సిటీలు నాణ్యమైన పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. వీసీ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన అవసరమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ప్రొఫెసర్ కనీజ్ జెహ్రా, డాక్టర్ సుధాంశుచంద్ర ప్రసంగించారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు, కమిషన్ల పేరుతో మోసం
- ఒకరు రూ.29 లక్షలు, మరొకరు 11.73 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.29 లక్షల 56 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ డిసెంబర్ 12న తన వాట్సాప్‌కు తేదీన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు.ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.29 లక్షల 56 వేలు చెల్లించాడు.సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో..

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 10వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.11 లక్షల 73 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్ కు చెందిన స్వపన్ సైబియా(38) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఘనపూర్ వచ్చి, స్థానికంగా ఉన్న భవ్య విలాస్‌లో కూలి పనిలో చేరాడు. అయితే తరచూ మద్యం సేవించి వస్తుండడంతో పనిలో నుండి తీసేశారు.ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన భవ్య విలాస్‌లో పనిచేసే స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు.మధ్యాహ్నం కావడంతో అందరు భోజనానికి వెళ్లారు. రెండో అంతస్తు పైకి వెళ్ళిన స్వపన్ సైబీయా తిరిగి కిందకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి.దీంతో స్థానికంగా ఉన్న కార్మికులు చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, మృతుడి మేనమామ తోపేసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.